# ధరణి సిబ్బంది భూమాయాజాలం

- కలెక్టర్‌నే బురిడీ కొట్టించిన ఇద్దరు పొరుగు సేవల ఉద్యోగులు
- 98 భూదస్త్రాలకు సంబంధించిన రికార్డులను దొడ్డి దారిలో 'ధరణి'లో నమోదు
- జిల్లా కలెక్టర్ ఆమోదం లేకుండానే తతంగం నడిపిన ధరణి కో-ఆర్డినేటర్, ఆపరేటర్
- పోలీసులకు ఫిర్యాదు చేసిన రంగారెడ్డి జిల్లా కలెక్టరేట్ ఏవో
- పోలీసుల అదుపులో సూత్ర ధారులు!..తెరవెనుక ఎవరెవరు ఉన్నారనే దానిపై ఆరా

రంగారెడ్డి, డిసెంబర్ 8(నమస్తే తెలంగాణ): ధరణి పోర్టల్‌లో సాంకేతిక అంశాలపై ఉన్న అవగాహనతో ఇద్దరు పొరుగు సేవల ఉద్యోగులు అక్రమాలకు పాల్పడ్డారు. భూ అక్రమాలకు అడ్డుకట్ట వేసే దిశగా తెలంగాణ ప్రభుత్వం తెచ్చిన 'ధరణి' పోర్టల్‌కు మచ్చ తెచ్చారు. ఏకంగా జిల్లా కలెక్టర్‌నే బురిడీ కొట్టించారు. కలెక్టర్ ఆమోదం లేకుండానే 98 భూదస్త్రాలకు సంబంధించిన రికార్డులను దొడ్డిదారిలో 'ధరణి'లో నమోదు చేశారు. సంవత్సరం సదేమియా అన్నట్లు.. ఎన్నికల హడావుడిలో అధికారులు ఉండగా.. ధరణి కో-ఆర్డినేటర్, ఆపరేటర్ అక్రమ దందాకు తెరతీశారు. రంగారెడ్డి జిల్లాలో ఈ అక్రమం ఆలస్యంగా వెలుగులోకి రావడంతో బాధ్యులైన ఇద్దరిని సస్పెండ్ చేయడంతోపాటు అక్రమాలపై లోతుగా విచారణ జరపాలంటూ కలెక్టరేట్ అధికారులు ఆదిభట్ల పోలీసులకు ఫిర్యాదు చేశారు.

**కలెక్టర్ ఆమోదం లేకుండానే ధరణిలోకి..**

కోర్టు కేసు, పాస్ బుక్ డేటా కరెక్షన్, పెండింగ్ మ్యుటేషన్, జీఎల్ఎం, అర్బన్ ల్యాండ్స్, గ్రీవెన్స్ నిషేధిత ఆస్తి సహా 98 దరఖాస్తులు రంగారెడ్డి జిల్లా కలెక్టర్ వద్ద పెండింగ్‌లో ఉన్నాయి. సంబంధిత దరఖాస్తులను క్షుణ్ణంగా పరిశీలించి కలెక్టర్ మాత్రమే ఆమోదం తెలపాల్సి ఉంది. కలెక్టర్ ఆమోదం లభించినట్లు రికార్డులు సృష్టించి ధరణిలో నమోదు చేశారు. ఏదైనా దరఖాస్తుకు కలెక్టర్ ఆమోదం తెలపాలంటే.. క్షేత్రస్థాయిలో అధికారులు ఇచ్చే రిపోర్టులే కీలకం కాగా.. ఎలాంటి రిపోర్టులు లేకుండానే ఆమోదం తెలిపినట్లుగా సిబ్బంది ధరణిలో నమోదు చేయడం గమనార్హం. అక్టోబర్ 14 నుంచి నవంబర్ 11 మధ్యలో ధరణి అక్రమాలు జరిగాయి. ఎన్నికల విధుల్లో నిర్లక్ష్యంగా వ్యవహరించారనే కారణంతో కేంద్ర ఎన్నికల కమిషన్ అప్పటి జిల్లా కలెక్టర్ హరీశ్‌పై వేటు వేసింది. ఆయన స్థానంలో కలెక్టర్‌గా భారతీహోళికేరి బాధ్యతలు నిర్వర్తించారు. ఆమె ఎన్నికల బిజీలో ఉండగా.. అదే అదనుగా సిబ్బంది అక్రమాలకు పాల్పడ్డారు. సాంకేతికతను అడ్డుపెట్టుకుని ధరణి కో-ఆర్డినేటర్, ఆపరేటర్ నడిపిన అక్రమ వ్యవహారం సర్వత్రా చర్చనీయాంశంగా మారింది.

**అక్రమాల తీగ లాగుతున్న పోలీసులు**

అధికారులు ఆదిబట్ల పోలీసులకు ఈనెల 5న ఫిర్యాదు చేయగా.. అప్పటి నుంచి ధరణి కో ఆర్డినేటర్, ఆపరేటర్ అజ్ఞాతంలోకి వెళ్లిపోయారు. ప్రస్తుతం వీరిద్దరినీ అదుపులోకి తీసుకుని పోలీసులు గోప్యంగా విచారిస్తున్నట్లు తెలిసింది. కలెక్టర్ తీసుకోవాల్సిన నిర్ణయాలను ఇద్దరు పొరుగు సేవల ఉద్యోగులు తీసుకుని అమలు చేయడం ప్రతి ఒక్కరినీ ఆశ్చర్యపరుస్తున్నది. ఈ నేపథ్యంలో వీరిద్దరి వెనుక ఇంకెవరైనా ఉన్నారా? గతంలో కూడా ఈ తరహా అక్రమాలు ఏమైనా చేశారా? అనే కోణంలో పోలీస్ ఉన్నతాధికారులు విచారణ చేస్తున్నారు. ఆది నుంచీ వీరిద్దరిపై ఎన్నో ఆరోపణలు ఉన్న క్రమంలో పోలీసులు లోతుగా దర్యాప్తు చేస్తున్నట్లు తెలిసింది.

**ఎంత మంది పాత్ర ఉందనే కోణంలో..**

ఆదిబట్ల : ధరణిలో చోటు చేసుకున్న ఘటనపై ఈ నెల 5న కలెక్టరేట్ ఏవో ప్రమీలారాణి ఫిర్యాదుతో 167, 409, 419, 420 ఐపీసీ, 66 సీ ఆఫ్ ఐటీ చట్టం కింద కేసు నమోదు చేశామని ఆదిబట్ల సీఐ రఘువీర్‌రెడ్డి తెలిపారు. ఈ ఘటనలో ఎంతమంది పాత్ర ఉన్నదనే కోణంలో దర్యాప్తు చేపట్టామన్నారు. త్వరలోనే నిందితులను అరెస్ట్ చేస్తామని తెలిపారు.

# తాండూరులో అగ్రిహబ్

- ఎవుసానికి తోడుగా సాంకేతిక
- రూ.1.58 కోట్ల నిధుల కేటాయింపు
- చురుకుగా సాగుతున్న పనులు, ఆరు నెలల్లో పూర్తి చేసేందుకు చర్యలు
- వ్యవసాయ పరిశోధన కేంద్రంగా ప్రాంతీయ కార్యాలయం



తాండూరులో నిర్మిస్తున్న అగ్రిహబ్ కార్యాలయం

తాండూరు, డిసెంబర్ 8: వ్యవసాయ రంగంలో ఇన్నోవేషన్, ఎంటర్ ప్రెన్యూర్‌షిప్‌లను ప్రోత్సహించేందుకు, వ్యవసాయానికి సాంకేతిక దన్నుగా నిలిచేందుకు ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయం హైదరాబాద్ కేంద్రంగా పని చేయనున్న హబ్ సేవలను వికారాబాద్ జిల్లాలోని గ్రామీణ ప్రాంత రైతులకు చేరువ చేసేందుకు తాండూరులో ప్రాంతీయ కార్యాలయం ఏర్పాటు చేయనున్నారు. అందులో భాగంగా తాండూరు వ్యవసాయ పరిశోధన కేంద్రంలో రూ.1.58 కోట్లతో అగ్రిహబ్ ఏర్పాటు పనులు చురుగ్గా కొనసాగుతున్నాయి. టీ హబ్‌ను ఆదర్శంగా తీసుకొని పలు స్టార్టప్ కంపెనీలతో ఒప్పందం కుదుర్చుకొని అగ్రిహబ్‌కు వ్యవసాయ వర్సిటీ రూపకల్పన చేసింది. వ్యవసాయానికి సాంకేతిక తోడ్పాటు అందించేందుకు యూనివర్సిటీ 11 నుంచి 21 స్టార్టప్‌లకు ఆమోదం తెలిపినట్లు సమాచారం. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, మిషన్ లెర్నింగ్ తదితర అధునాతన సాంకేతికను వ్యవసాయ రంగంలో ఈ స్టార్టప్‌ల సాయంతో వినియోగించనున్నారు. డ్రోన్ల ద్వారా మందుల పిచికారీ, రోబోటిక్ విధానంలో కలుపుతీయడం, తెగుళ్ల గుర్తించడం తదితర సమాచారంతో పాటు గ్రామీణ యువత, మహిళలు, రైతులు, రైతు ఉత్పత్తిదారుల సంఘాలు అగ్రి బిజినెస్ మెళకువలు నేర్చుకునేందుకు గ్రంథాలయంగా ఉపయోగపడుతుందని వ్యవసాయ శాఖ అధికారులు, శాస్త్రవేత్తలు వెల్లడించారు.

**వేగవంతంగా అగ్రిహబ్ నిర్మాణ పనులు**

నాబార్డు ఆర్థిక సాయంతో తాండూరు వ్యవసాయ పరిశోధన కేంద్రంలో రూ.158 కోట్లతో అగ్రిహబ్ నిర్మాణం పనులు వేగంగా జరుగుతున్నాయి. ఆరు నెలల్లో అగ్రిహబ్ పనులు పూర్తవుతాయని, అప్పటివరకు రైతులకు అగ్రిహబ్‌పై అవగాహన కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తాండూరు వ్యవసాయ పరిశోధన శాస్త్రవేత్తలు తెలిపారు. గ్రామీణ యువత, మహిళలు, రైతులు, రైతు ఉత్పత్తిదారుల సంఘాలకు అగ్రి బిజినెస్ మెళకువలపై అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో వ్యవసాయం చేయడం, అధిక దిగుబడుల సాధనకు శిక్షణ ఇవ్వడంతో పాటు వివిధ రకాల విత్తనాల (వంగడాలు)పై అవగాహన చేయనున్నట్లు తెలిపారు. తాండూరులో నాణ్యమైన కుసుమ నూనె, కందిపప్పు తయారు చేసి ఇతర ప్రాంతాల్లో విక్రయిస్తున్నారు. దీంతో మంచి పేరు రావడంతో పాటు తాండూరు వ్యవసాయ పరిశోధన కేంద్రంలో అధిక దిగుబడులు ఇచ్చే నూతన వంగడాలను తయారు చేయడంతో తాండూరులో అగ్రిహబ్ ఏర్పాటు చేసే అవకాశం వచ్చినట్లు శాస్త్రవేత్తలు తెలిపారు. దీంతో తాండూరుతో పాటు జిల్లా రైతులకు మరింత మేలు జరగనున్నది.

**గ్రంథాలయంగా అగ్రిహబ్**



గ్రామీణ యువత, మహిళలు, రైతులు, రైతు ఉత్పత్తిదారుల సంఘాలు అగ్రిబిజినెస్ మెళకువలు నేర్చుకునేందుకు అగ్రిహబ్ ఓ గ్రంథాలయంగా ఉపయోగపడుతుంది. నూతన టెక్నాలజీతో నాణ్యమైన విత్తనాలు, మొక్కలకు కావాల్సిన ఎరువులు, పురుగు మందులు, పంట దిగుబడి తదితర వివరాలు అందుబాటులో ఉంటాయి. అగ్రిహబ్‌ను ఫాలో అయిన రైతుకు పెట్టుబడులు తగ్గి పంటలో నాణ్యత పెరుగుతుంది. దీంతో రైతులకు అధిక దిగుబడులు పెరుగుతాయి. తాండూరులో అగ్రిహబ్ ఏర్పాటు చేయడం జిల్లా రైతులకు వరం.

- డాక్టర్ సుధాకర్, ప్రధాన శాస్త్రవేత్త, తాండూరు వ్యవసాయ పరిశోధన కేంద్రం

# సైకో కిల్లర్ అరెస్టు

- ఏడు హత్యలు చేసిన నిందితుడికి రిమాండ్
- అడ్డకూలి మహిళలే టార్గెట్
- పలు స్టేషన్లలో కేసులు నమోదు

యాలాల, డిసెంబర్ 8 : తాండూరు పట్టణంలో అదృశ్యమైన మహిళ హత్య మిస్టరీని ఛేదించడంతో పాటు సైకో కిల్లర్ ఆట కట్టించారు పట్టణ పోలీసులు. శుక్రవారం తాండూరు డీఎస్పీ కార్యాలయంలో డీఎస్పీ శేఖర్ గౌడ్, పట్టణ సీఐ రాజేందర్ రెడ్డితో కలిసి హత్యకు గురైన మహిళ స్వరాబీ, నిందితుడిని మీడియా ముందు ప్రవేశపెట్టి వివరాలు వెల్లడించారు. కర్ణాటక రాష్ట్రం గుల్బర్గ తాలూకా, మద్గల్ గ్రామానికి చెందిన స్వరాబీ (42) తాండూరు పట్టణం ధన్గర్ గల్లీలో నివాసముంటూ అడ్డమీది కూలీ పని చేసుకుంటూ జీవిస్తున్నది. నవంబర్ 29న తాండూరు పట్టణంలోని శాంత్ మహల్ చౌరస్తాలోని అడ్డమీదికి పని కోసం వెళ్లి తిరిగి రాలేదు. డిసెంబర్ ఒకటో తేదీన భర్త మహమూద్ స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో పోలీసులు కేసు నమోదు చేశారు. పట్టణ సీఐ రాజేందర్ రెడ్డి ఆధ్వర్యంలో దర్యాప్తు ప్రారంభించారు. సీసీ ఫుటేజీ ఆధారంగా ధారూర్ మండలం అల్లీపూర్ గ్రామానికి చెందిన మాల కిష్టప్ప (55) వెంట వెళ్లినట్లు గుర్తించి, నిందితుడిని అదుపులోకి తీసుకొని విచారించగా, నేరం తానే చేసినట్లు ఒప్పుకున్నాడు. తాండూరు పట్టణంలోని అడ్డా వద్ద కిష్టప్ప స్వరాబీని ఓ గ్రామంలో పని ఉందంటూ జహీరాబాద్ వైపు వెళ్లే బస్సులో తీసుకెళ్లి పెద్దేముల్ మండలంలోని తట్టేపల్లి అట ప్రాంతంలో ఆమె చీర కొంగుతో మెడ బిగించి హత్య చేసి ఆమె వద్ద ఉన్న చైనులు, రూ.1000, మొబైల్ ఫోన్ తీసుకొని స్వగ్రామానికి వెళ్లిపోయాడు. అడ్డా కూలీ మహిళలే లక్ష్యంగా సైకోలా గతంలో వికారాబాద్, యాలాల, ధారూర్ పోలీస్ స్టేషన్ల పరిధిలో ఆరు హత్య కేసులు నమోదైనట్లు గుర్తించామన్నారు. హత్య కేసుల్లో 2021 నుంచి 2023 వరకు జైల్లోనే ఉన్నాడు. నిందితుడిని పక్కా ఆధారాలతో రిమాండ్‌కు తరలించారు.



వివరాలు వెల్లడిస్తున్న పట్టణ డీఎస్పీ శేఖర్ గౌడ్, సీఐ రాజేందర్ రెడ్డి

## నేటి నుంచి.. ఆర్టీసీ బస్సుల్లో

మధ్యాహ్నం నుంచి ప్రారంభం కానున్న సౌకర్యం

# మహిళలకు ఉచిత ప్రయాణం




ఇబ్రహీంపట్నం, డిసెంబర్ 8 : కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీల్లో భాగంగా శనివారం నుంచి ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణం కల్పించనున్నది. ఈ మేరకు ఆర్టీసీ ఉన్నతాధికారులు డిపో మేనేజర్లకు గైడ్‌లైన్స్ జారీచేశారు. తెలంగాణలో పుట్టిన మహిళలు సంబంధించి ఏదైనా గుర్తింపు కార్డుతో రాష్ట్ర వ్యాప్తంగా బస్సుల్లో ఉచితంగా ప్రయాణించడానికి వీలు కల్పించారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి శనివారం మధ్యాహ్నం మహిళలకు బస్సు ల్లో ఉచిత ప్రయాణం సౌకర్యాన్ని అధికారికంగా ప్రారంభించనున్నారు. అందులో భా గంగానే రంగారెడ్డి జిల్లాలోని అన్ని డిపోల్లో మహిళలకు ఉచిత ప్రయాణం కల్పించాలని ఆయా డిపో మేనేజర్లకు ఆదేశాలు జారీ చేశారు. నగరంతో పా టు శివారు ప్రాంతాల్లో సిటీ ఆర్డినరీ బ స్సులు, మెట్రో ఎక్స్‌ప్రెస్‌లు, గ్రామీణ ప్రాంతాల్లో ఆర్డినరీ బస్సులు, పల్లె వె లుగు, ఎక్స్‌ప్రెస్ బస్సుల్లో మహిళలు ఉచితంగా ప్రయాణం చేయవచ్చు. బ స్సుల్లో ప్రయాణం చేసే మహిళలు తమ వెంట ఆధార్ లేదా ఓటర్ ఐడీతో పాటు ఇతర ఏదైనా గుర్తిం పు కార్డును తీసుకు రావాల్సి ఉంటుందని ఆర్టీసీ అధికారులు తెలిపారు. నేటి మధ్యాహ్నం నుంచి ఈ సౌకర్యం అందుబాటులోకి వస్తుందని తెలిపారు.

**రంగారెడ్డి జిల్లా పరిధిలో...**

రంగారెడ్డి జిల్లా పరిధిలోని ఇబ్రహీంపట్నం, మహేశ్వరం, షాద్‌నగర్, హయత్‌నగర్-1, 2, బండ్లగూడ, మిధాని తదితర డిపోలు జిల్లా పరిధిలోకి వస్తాయి. ఈ డిపో పరిధిలోని బస్సు ల్లో నేటి నుంచి మహిళలు ఉచితంగా ప్రయాణం చేయవచ్చు. ఇబ్రహీంపట్నం డిపో పరిధిలో 118 ఆర్టీసీ, ప్రైవేటు బస్సులుండగా, ప్రతిరోజూ సుమారు 30రూట్లల్లో ఈ బస్సులు తిరుగుతున్నాయి. ఈ డిపో పరిధిలోని అన్ని రూట్లల్లో మ హిళలకు ఉచిత ప్రయాణం అందుబాటులోకి రానున్నది. జిల్లా వ్యాప్తంగా ఈ మేరకు డిపో మేనేజర్లకు ఆదేశాలు రావడంతో ఆయా రూట్లల్లో బ స్సులను నడిపే డ్రైవర్, కండక్టర్లకు కూడా మార్గదర్శకాలు జారీ చేశారు. ఆర్టీసీలో మహిళలకు ఉచిత ప్రయాణం అవకాశం కల్పించడంతో పలువురు మహిళలు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.